ఐదుగురు సిఐల బదిలీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ పరిధిలో ఐదుగురు సిఐలను బదిలీ చేస్తూ డిఐజి అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఆకివీడు సిఐ ఎం.గీతారామకృష్ణను కాకినాడ జిల్లా తుని సిఐగా బదిలీ అయ్యారు. తుని సిఐ నాగదుర్గారావును ఏలూరు రేంజ్ విఆర్‌కు తరలించారు. విఆర్‌లో ఉన్న జి.శ్రీనివాసును భీమవరం టుటౌన్ సిఐగా, భీమవరం టుటౌన్ సిఐ బి.కృష్ణకుమార్‌ను కైకలూరు సిఐగా బదిలీ చేశారు. కైకలూరు సిఐ వైవిఎల్ నాయుడును విఆర్‌కు తరలించారు.

మెడికల్ కాలేజీ..
పనులు పూర్తయ్యేనా..!

ఏలూరు మెడికల్ కాలేజీకి 150 సీట్లు కేటాయింపు

నేటితో ఆలిండియా కోటా వెబ్ ఆప్షన్లు పూర్తి

స్టేట్ కోటా సీట్లకు రిజిస్ట్రేషన్ ఆరంభం

మరో నెలలో ప్రారంభంకానున్న తరగతులు

ఇప్పటికీ పూర్తికాని కాలేజీ భవనాల నిర్మాణ పనులు

తొలి ఏడాది వైద్యవిద్య సక్రమంగా సాగేనా అన్న అనుమానాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మరో నెలలో తరగతులు ప్రారంభం కానున్నా ఇప్పటికీ ఏలూరు మెడికల్ కాలేజీ పనులు పూర్తికాకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఈ కళాశాలలో సీట్లు పొందిన విద్యార్థులకు తరగతుల నిర్వహణ సవ్యంగా సాగేనా అనే అనుమానాలు నెలకొన్నాయి. కళాశాల నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ఆ ప్రభావం తరగతులపై పడితే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందనే చర్చ విద్యార్థుల్లో నడుస్తోంది. ఈ ఏడాది నుంచి రాష్ట్రంలో ఐదు కొత్త మెడికల్ కాలేజీలను ప్రభుత్వం ప్రారంభించింది. అందులో ఏలూరు మెడికల్ కాలేజీ ఒకటి. కొత్తగా ప్రారంభించే మెడికల్ కాలేజీలకు 150 సీట్లు చొప్పున కేటాయించడంతో ఏలూరు మెడికల్ కాలేజీలోనూ ఈ ఏడాది 150 సీట్లు భర్తీ కానున్నాయి. ఇప్పటికే వైద్య విద్య సీట్ల భర్తీకి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నెల 22న ఆలిండియా కోటా కింద భర్తీ చేసే 15 శాతం సీట్లకు సంబంధించి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభమై 26వ తేదీతో ముగియనుంది. స్టేట్ కోటాలో భర్తీ చేసే సీట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. ఆగస్టు మొదటివారంలో వెబ్ ఆప్షన్లు మొదలు కానున్నాయి. సీట్ల భర్తీని పూర్తి చేసి సెప్టెంబర్ మొదటివారంలో మెడికల్ కాలేజీకి సంబంధించిన తొలి ఏడాది తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇంకా నెల రోజుల్లో వైద్య విద్యార్థులు చదువుకునేందుకు వస్తున్నప్పటికీ ఏలూరు మెడికల్ కాలేజీ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఇంకా అనేక పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. హడావుడిగా పనులు సాగిస్తున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే పనులు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. నిర్మాణ పనులు జరుగుతుండటంతో కాలేజీ చుట్టూ బురదమయంగా మారింది. ఇక ల్యాబ్‌లకు సంబంధించిన పనులు ఎంతవరకూ వచ్చాయో తెలియని పరిస్థితి ఉంది. నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో వైద్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందనే చర్చ నడుస్తోంది. కాలేజీ పనులు ఎంతశాతం పూర్తయ్యాయి. ఇంకా ఏయే పనులు పూర్తి చేయాల్సి ఉందనే వివరాలను సైతం ఏ ఒక్కరూ చెప్పడం లేదు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల తీరుపై ప్రిన్సిపల్ విజయకుమార్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కొత్త మెడికల్ కాలేజీల్లో ఫీజుల బాదుడు

ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజీల్లో ఫీజుల బాదుడుకు తెరలేపింది. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా కొత్త మెడికల్ కాలేజీల్లో కేటగిరీల విధానం తెచ్చి రూ.లక్షల్లో ఫీజులు నిర్ణయించింది. ప్రభుత్వ విధానంతో జనరల్ సీట్లు తగ్గిపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏలూరు కాలేజీలోనూ ఇదే పరిస్థితి కొనసాగనుంది. కొత్త మెడికల్ కాలేజీలోని వైద్య సీట్లను 15శాతం ఆలిండియా కోటా కింద భర్తీ చేయనుంది. జనరల్ కోటా కింద 50 శాతం సీట్లు, మిగిలిన 35 శాతం సీట్లలో 20 శాతం సీట్లు సెల్ఫ్‌ఫైనాన్స్ కింద రూ.12 లక్షల ఫీజుతో, 15 శాతం సీట్లు ఎన్ఆర్ఐ కోటాలో రూ.20 లక్షల ఫీజుతో కేటాయించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఉన్న మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోటా 15 శాతం సీట్లు పోను మిగిలిన 85 శాతం సీట్లను జనరల్ కేటగిరి కిందనే కేటాయిస్తున్నారు. కొత్తగా ప్రారంభమవుతున్న ఐదు మెడికల్ కాలేజీల్లోనూ ప్రభుత్వ కేటగిరి విధానం ప్రవేశపెట్టింది. ఇది భవిష్యత్తులో పేద, మధ్యతరగతి విద్యార్థులకు పెనుశాపంగా మారనుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముంపులో గుండేటి వాగు కాజ్‌వే

గోదావరి దోబూచులాట..!

తగ్గి మళ్లీ పెరుగుతున్న వరద ఉధృతి

వారం రోజులుగా ముంపులోనే రహదారులు

తీవ్ర ఇబ్బందుల్లో విలీన మండలాల ప్రజలు

ప్రజాశక్తి - కుక్కునూరు

గోదావరి వరద దోబూచులాడుతోంది. వారం రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వస్తున్న గోదావరి వరద మళ్లీ మంగళవారం ఉదయం నుంచి పెరుగుతోంది. వారం రోజుల క్రితం భద్రాచలంలో 44 అడుగులకు చేరిన వరద తగ్గుముఖం పట్టి మంగళవారం ఉదయానికి 36 అడుగులకు చేరుకుంది. దీంతో కొద్దిసేపు నిలకడగా ఉన్న గోదావరి వరద తర్వాత క్రమేపీ పెరగడం ప్రారంభమై సాయంత్రానికి 39 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదులుతుండటం, ఏజెన్సీ ప్రాంతంలో కుండపోత వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇక శబరి నది పొంగిపొర్లుతోంది. వెరసి గోదావరికి వరద పోటెత్తుతోంది. మండలంలోని గుండేటి వాగు కాజ్‌వే వారం రోజులుగా ముంపులోనే ఉండటంతో 14 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద తగ్గడంతో రెండు రోజులుగా వింజరం-ముత్యాలంపాడు మధ్య పాలవాగుపై నుండి రాకపోకలు సాగుతున్నాయి. అయితే మళ్లీ వరద పెరుగుతుండటంతో కౌండిన్యముక్తి, ముత్యాలంపాడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. మండలంలో మొక్క దశలో ఉన్న పత్తి ముంపునకు గురి కావడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

నినదిస్తున్న నేతలు, ప్రజలు

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే యోచన విరమించుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ ప్రజలపై భారాలు వేయబోమని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట తప్పడం దారుణమన్నారు. తక్షణం పెంచిన ఛార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్.మరిడియ్య, ఎస్.శివకుమార్, కె.సీతారాముడు, సిహెచ్.సత్యనారాయణ, జి.గోపీ, పి.తమ్మారావు, ఎస్‌కె.బాబ్జీ, నాని, త్రిమూర్తులు, నాగు, మధు, దుర్గారావు, సురేష్ పాల్గొన్నారు.

సచివాలయ పోలీసులకు..
కోర్టు విధులు..!

డిజిపి, ఎస్‌పి ఆదేశాలు బేఖాతరు

పాలకోడేరు పోలీసుల తీరుపై సర్వత్రా చర్చ

కోర్టు విధులకు ముగ్గురు మహిళా పోలీసులు

ఉన్నతాధికారులు స్పందించేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు (మహిళా పోలీసులు) పోలీస్ విధులు కేటాయించొద్దని, ఆదేశాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని డిజిపి, జిల్లా ఎస్‌పిలు ఆదేశాలు జారీ చేసినా కొంతమంది స్టేషన్ అధికారులు పట్టించుకోని పరిస్థితి ఉంది. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలంలో సోమవారం చోటుచేసుకున్న పరిస్థితులే దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. ఆ మండలంలో పాలకోడేరు, గొరగనమూడి, కుముదవల్లి సచివాలయాల పరిధిలో పని చేసే ముగ్గురు మహిళా పోలీసులకు సోమవారం భీమవరంలోని కోర్టు విధులు కేటాయించారు. దీంతో మహిళా పోలీసులు ఆ విధులకు హాజరయ్యారు. మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించొద్దంటూ ఉన్నతాధికారులిచ్చినా ఆదేశాలను పట్టించుకోకుండా కోర్టు విధులు కేటాయించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. విషయం బయటికి పొక్కడంతో హడావుడిగా అధికారులు తమ తప్పేమీ లేదన్నట్లు వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇది ఈ ఒక్క స్టేషన్‌కే కాదని, ఇతర స్టేషన్లలోనూ మహిళా పోలీసులకు ఫోన్ చేసి కొంతమంది అధికారులు వివిధ రకాల పోలీస్ విధులను అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు జారీచేసిన ఆదేశాలను సైతం అమలు చేయకపోవడంపై సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వినతిపత్రమిచ్చి సమస్య వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని ఏలూరు నగర అభివృద్ధి కమిటీ, అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యాన ప్రజల నుండి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఉదయం స్థానిక వసంత మహల్ సెంటర్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో సిపిఎం, జనసేన, కాంగ్రెస్, తెలుగుదేశం, పట్టణ పౌర సమాఖ్య, చేతివృత్తిదారుల సంఘం నాయకులు, గౌతమబుద్ధ ప్రచార ట్రస్ట్ ఛైర్మన్ పాల్గొన్నారు. ఏలూరు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కె.రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, జనసేన నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీనరేష్, టిడిపి నగర నాయకులు జిల్లెళ్లమూడి ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం దొడ్డిదారిన ప్రజలపై రూ.2,500 కోట్లు ఛార్జీల భారం వేస్తుందని విమర్శించారు. ట్రూఅప్, సర్దుబాటు, అదనపు, సర్వీసు ఛార్జీ అంటూ రకరకాల పేర్లతో ప్రజలపై కరెంటు ఛార్జీల భారం రాష్ట్ర ప్రభుత్వం మోపిందన్నారు. సామాన్య ప్రజలు వందల్లో కట్టే కరెంటు బిల్లు నేడు వేలల్లో కట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 2020లో తెచ్చిన విద్యుత్ సవరణల చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయడం వల్ల కరెంటు ఛార్జీలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం పెంచిన కరెంటు ఛార్జీలే కాకుండా, అదానీ కంపెనీ నుండి స్మార్ట్ మీటర్లను కొనుగోలు చేసి బిగించాలని చూస్తుందని అన్నారు. స్మార్ట్ మీటర్లకయ్యే ఖర్చు వినియోగదారులపై మోపాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలపై ఆస్తి, ఇంటి, చెత్త సేకరణ పన్నులు, ఆర్‌టిసి ఛార్జీలు ఇలా పలు రూపాల్లో భారం పడిందని, మళ్లీ స్మార్ట్ మీటర్ల భారం వేయడం తగదన్నారు. పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యుత్ ఛార్జీల వ్యతిరేక ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేతివృత్తిదారుల జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు, గౌతమ బుద్ధ ప్రచార ట్రస్టు ఛైర్మన్ ఎం.ఇస్సాక్, సిపిఎం నాయకులు వైఎస్.కనకారావు, కట్టా సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు, సిఐటియు నగరాధ్యక్షులు బి.జగన్నాధరావు, కాంగ్రెస్ నేతలు దండుబోయిన చంద్రశేఖర్, కోసూరి చంద్రకాంతమ్మ, సాగే బాబుప్రసాద్, ఉప్పు మురళీకృష్ణ, ఎస్‌వి.సుబ్బారావు, జనసేన నాయకులు దుర్గాప్రసాద్, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ అకృత్యాలపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు

మణిపూర్‌లో దమనకాండ, మతోన్మాదుల అరాచకాలను నిరసిస్తూ సిఐటియు, జెవివి, ఐద్వా, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, యుటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమానుష ఘటనలకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలన్నింటికీ కేంద్రంలోనూ, అక్కడి రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బిజెపి వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముస్తఫాఆలీ, ఆర్.రవికుమార్, జిల్లా సహాధ్యక్షులు వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారి రంగమోహన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పివి నర్సింహరావు, నేత శివశంకర్, పుష్పరాజు, మోహన్‌రావు, రాజారావు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ, నేతలు గీత, పరమేశ్వరి, దేవి, సిఐటియు నేతలు విజయలక్ష్మి, పి.కిషోర్, బి.జగన్నాధం, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, అంగన్వాడీ నేతలు దుర్గాభవాని, దుర్గామహేశ్వరి, సుజాత, సుధ, స్వాతి, ఐలు నేత కట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.

నినదిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ఏలూరు అర్బన్: మణిపూర్‌లో మతోన్మాదుల అరాచకాలు, అకృత్యాలను అరికట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యాన పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌తోపాటు జిల్లా నేత కొండేటి బేబీ మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో నినాదాలకు ప్రధాని పరిమితం కాకుండా, మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు ఉప్పులూరి హేమశంకర్, కురెళ్ల వరప్రసాద్, కొంపల్లి కృష్ణమాచార్యులు, అడ్డగర్ల లక్ష్మీఇందిర, కొల్లూరు సుధారాణి, లక్ష్మి, భవాని పాల్గొన్నారు.

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన

మణిపూర్‌లో విధ్వంసకాండను మెడీషా ప్రభుత్వం అరికట్టాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకటరావు డిమాండ్ చేశారు. ఎపి బేవరేజ్ కార్పొరేషన్ గొడౌన్ ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు. నేతలు శ్రీనివాసరావు, రాచేటి జాన్, పద్మ, రాములమ్మ, సూర్యావతి, సింహాచలం, కుమారి, సత్యవతి పాల్గొన్నారు.

ఏలూరు: మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైన ఆ రాష్ట్ర సిఎం బీరెన్‌సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ఎపి చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కోకన్వీనర్ ఆగొల్ల వెంకటకృష్ణారావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు.

కుక్కునూరు: మణిపూర్ ఘటనలకు ప్రధాని మోడీ బాధ్యత వహించి తక్షణం రాజీనామా చేయాలని సిపిఐ (ఎంఎల్) జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కొండా ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు బి.సత్యనారాయణ, మడకం మల్లేష్, కల్లయ్య, దుర్గమ్మ, మున్నీ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: మణిపూర్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, తక్షణం రాష్ట్రపతి పాలన పెట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో దోషులను కఠినంగా శిక్షించాలని, శాంతిని నెలకొల్పాలని సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షతన మంగళవారం నిరసన చేపట్టారు. స్థానిక భగత్‌సింగ్ సెంటర్ నుండి బోసు బొమ్మ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బోసు బొమ్మ సెంటర్ వద్ద జల్లి విల్సన్, ఆవుల శేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా నేతలు బత్తుల వెంకటేశ్వరరావు, బాడిస రాము, మైసాక్షి వెంకటాచారి, జెవి.రమణరాజు పాల్గొన్నారు.

సర్పంచులకు నిధులు.. విధులేవీ

- అధికార పార్టీ నేతల తీరు అభ్యంతరం
- నిలదీసిన మహిళా సర్పంచులు
- కాగుపాడులో ఆ ఉపాధ్యాయులు మాకొద్దు
- వాడీవేడిగా ఉంగుటూరు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాజ్యాంగబద్ధంగా ప్రజలచే ఎన్నుకోబడిన గ్రామ సర్పంచులకు నిధులు, విధులు లేకుండా నిర్వీర్యం చేశారని అధికార పార్టీపై పలు గ్రామాల మహిళా సర్పంచులు నిప్పులు చెరిగారు. ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగింది. నారాయణపురం వైఎస్ఆర్ కాలనీలో విద్యుత్ లోఓల్టేజీ నివారణకు 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు రెండు మంజూరై రెండు నెలలు గడుస్తున్నా ఎందుకు బిగించలేదని, ఏమైనా రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అంటూ సర్పంచి దిడ్ల అలకనంద ప్రశ్నించారు. విద్యుత్ ఎఇ శ్రీరామ్ స్పందిస్తూ కాంట్రాక్టర్ ఇతర పనుల్లో ఉన్న కారణంగా ఆలస్యమైందని, త్వరలో పనులు చేయిస్తామని తెలిపారు. గ్రామాల్లో అన్ని పనులకూ ఛైర్మన్ సర్పంచి అయినప్పుడు అధికారులు తమకు ఎలాంటి సమాచారం, ఆహ్వానం ఇవ్వడం లేదని, అధికార పార్టీ నేతల పెత్తనం ఏమిటని అలకనంద ప్రశ్నించారు. చేబ్రోలు సర్పంచి రాంథే లక్ష్మీసునీత మాట్లాడుతూ పంచాయతీలకు రావాల్సిన నిధులను ప్రభుత్వమే తీసేసుకుంటే ఇంక తాము గ్రామాల్లో ఏం చేయాలని నిలదీశారు. చేబ్రోలు గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు. ఉంగుటూరు సర్పంచి బండారు సింధు మాట్లాడుతూ డంపింగ్ యార్డు లేకపోవడంతో కాగుపాడు వెళ్లే దారి పొడవునా చెత్త వేయడం వల్ల పారిశుధ్య నిర్వహణ ఇబ్బందిగా ఉందన్నారు. పంచాయతీకి నిధుల కొరతతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. యర్రమిల్లిపాడులో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు ఇసుక, ఇనుము కోసం దాదాపు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న బొమ్మిడి వెళ్లి తెచ్చుకోవడం ఆర్థిక భారంగా ఉందని, గొల్లగూడేనికి మెటీరియల్ డిపోను మార్చాలని సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు కోరారు. తిమ్మయ్యపాలెంలో జలజీవన్ మిషన్‌లో రూ.15 లక్షలతో పైపులైను నిర్మాణ పనులు జరుగుతున్నా సంబంధిత అధికారులు రాకపోతే నాణ్యత, నిధులు వ్యయం పర్యవేక్షణ కొరవడిందని సర్పంచి సింహాద్రి శ్రీదేవి అన్నారు. సంబంధిత సచివాలయ ఉద్యోగికి మెమో ఇస్తానని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు తెలిపారు. కాగుపాడు జెడ్‌పి హైస్కూల్‌లో ఓ ఇద్దరు ఉపాధ్యాయులు బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు చేసినా సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోకుండా రాజకీయ ఒత్తిళ్లతో విచారణ మమ అన్పించడం దారుణమని, ఆ ఉపాధ్యాయులు మాకొద్దు అంటూ కాగుపాడు సర్పంచి కడియాల సుదేష్ణచిట్టిబాబు స్పష్టం చేశారు. దీనిపై ఎంఇఒ-2 శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిర్యాదులో ఉపాధ్యాయుని పేరు లేకపోవడంలో అధికారులు విచారించి వెళ్లారన్నారు. దీనిపై మరోమారు స్పందనలో ఫిర్యాదు చేస్తామని సర్పంచి వెల్లడించారు. నీలాద్రిపురంలో పలు విద్యుత్ స్తంభాలు పడిపోతున్నాయని, వాటిస్థానంలో కొత్తవి బిగించాలని కోరినా అధికారులు పూర్తిస్థాయిలో స్పందించడం లేదని సర్పంచి చదలవాడ రాజేంద్రకుమార్ అన్నారు. దాదాపు 15 స్తంభాలు కొత్తగా బిగించామని, తమ తప్పేమీ లేదని ఎలక్ట్రికల్ ఎఇ శ్రీరామ్ సమాధానం ఇచ్చారు. హౌసింగ్ డిఇ సోమశేఖర్ మాట్లాడుతూ మండలంలో జగనన్న ఇళ్లు1572 నిర్మాణం పూర్తవగా ఆగస్టు 15 నాటికి 1653 ఇళ్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. సమావేశంలో అధికార పార్టీకి చెందిన పలువురు సర్పంచులు సైతం సమస్యలపై గళమెత్తారు. సర్పంచుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపిపి, ఎంపిడిఒ హామీ ఇచ్చారు.

సర్పంచుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న అధికారులు

ఎంపిపికి సర్పంచుల వినతి

పంచాయతీ నిధులను దొంగచాటుగా రాష్ట్ర ప్రభుత్వం తీసేసుకోవడమే కాక స్టాంప్ డ్యూటీ ,ఇతర గ్రాంట్లను సైతం పంచాయతీకి రానివ్వకుండా గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు కోల్పోయామని ఇప్పటికైనా నిధులు ఇవ్వాలంటూ మహిళా సర్పంచులు అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. కార్య క్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల భూములను దున్నిన వారిపై చర్యలు తీసుకోండి

సిపిఎం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వినతిపత్రమిచ్చి సమస్య వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

మర్లగూడెంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న 1/70 చట్టం భూములను దౌర్జన్యంగా దున్నివేసిన గిరిజనేతరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన స్థానిక తహాశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మర్లగూడెంలో సర్వే నెం.39, 40, 41, 34లో 20 ఎకరాల 1/70 చట్టం భూములను గ్రామంలోని గిరిజనులు గత 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ నెల 24న గిరిజనేతరులైన బండారు వెంకటేశ్వరరావు, పోల్నాటి వెంకట సుబ్బారావు అనే వారు కిరాయి గుండాలను తీసుకొచ్చి గిరిజనులు వేసిన పంటలను దౌర్జన్యంగా దున్నివేశారని, వీరికి రెవెన్యూ, పోలీస్ అధికారులు సహకరించారని ఆరోపించారు. ఈ భూములు 1/70 చట్టప్రకారం గిరిజనులకే చెందుతాయన్నారు. ఆర్‌డిఒ చట్టవిరుద్ధంగా గిరిజనేతరులకు పోలీసు ప్రొటెక్షన్ ఇచ్చారని విమర్శించారు. ఈ భూసమస్యను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహాశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు, జి.వెంకట్రావు, పూసం దుర్గారావు, మడకం లక్ష్మి, పెద్దసంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాపై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - పోలవరం

స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024లో భాగంగా నియోజవర్గంలో ఉన్న 284 పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ఇంటింటి సర్వేకు సంబంధించి అన్ని పార్టీల నాయకులతో నియోజకవర్గ స్థాయి సమావేశం పోలవరం మండల స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. మంగళవారం తహశీల్దార్ బి.సుమతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకుల నుంచి వారి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ జాబితాలో ఉన్న తప్పులను సరిచేయాలని, జీరో డోర్ నెంబర్‌తో ఉన్న ఓట్లను వెంటనే సరిచూడాలని, ఒకే డోర్ నెంబర్‌కు సంబంధించిన ఓట్లను ఆ సంబంధిత డోర్ నెంబర్‌కు వచ్చేటట్లు సరిచేయాలన్నారు. బిఎల్‌ఒలు పార్టీలకు సంబంధించిన బూత్ లెవెల్ ఏజెంట్లకు సమాచారం ఇవ్వాలని టిడిపి నాయకులు తహశీల్దార్‌ను కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.సుమతి మాట్లాడుతూ ఇంటింటి సర్వే ద్వారా తప్పులులేని ఓటరు జాబితాను తయారు చేయాలని, వివిధపార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లకు సమాచారం ఇవ్వాలని బిఎల్‌ఒలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సంకర వెంకట రెడ్డి, టిడిపి నుంచి నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బా రాంబాబు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, జల్లెపల్లి జితేంద్ర, బిఎల్‌ఒలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దళితులపై దాడులు అరికట్టాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి రమణ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో 'మనువాద కార్పొరేట్ ఫాసిజానికి' వ్యతిరేకంగా పోరాడుదాం అంటూ ఈనెల 17 నుంచి ఆగస్టు 6 వరకూ ప్రచార ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐయఫ్‌టియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం సభ నిర్వహించారు. ఈ సభలో కెవి రమణ మాట్లాడుతూ దళితులపై లైంగిక దాడులను, హత్యాకాండలను, హక్కుల కాలరాతను వ్యతిరేకిస్తూ ప్రచారం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కమిటీ భావించిందని అన్నారు. దళితులు పోరాడి సాధించుకున్న సంక్షేమ చట్టాలను, పథకాలను ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని, వాటిని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, గంపల వెంకటేష్, ముప్పిడి గంగారం, దొండపాటి వెంకటేష్, పొడిదోలు దుర్గారావు పాల్గొన్నారు.

కోనా శ్రీనివాసరావుకు ఫిల్మ్ ఫేర్ అవార్డు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

ఆర్యవైశ్య ప్రపంచ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు కోడి రామకృష్ణ ఫిలింఫేర్ 2023 అవార్డు అందుకున్నారు. ఈనెల 23న తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు చేసిన పలు సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు ఇచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉంగుటూరు మండలంలో విలేకరులకు శ్రీనివాసరావు వాటి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును పలువురు ఆర్యవైశ్యలు అభినందించారు.

రూ.5 వేలు విలువైన నోట్‌బుక్స్ అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్నవారికి డిఫర్ వెల్ఫేర్ సొసైటి సంస్థ ఎల్లప్పుడూ సహాయపడుతుందని, డిఫర్ వెల్ఫేర్ సొసైటి కన్వీనర్ కంచెర్ల బుచ్చిబాబు అన్నారు. పట్టణంలో డిఫర్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో ఎంపియుపి పాఠశాల పట్టాయగూడెం ఎస్‌సి పాఠశాలకు 25 మంది విద్యార్థులకు రూ.5 వేల విలువైన నోట్‌బుక్స్, విద్యా సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ కంచర్ల బుచ్చిబాబు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనేక పాఠశాలలకు విద్యా సామాగ్రి అందించామన్నారు. విద్యార్థులు ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెంకటేశ్వరరావు, పిసి కమిటీ ఛైర్మన్ రాఘవ, హెచ్‌యం నాగరాజు పాల్గొన్నారు.

జోరువానలోనూ వట్టి పవన్ పర్యటన

ప్రజాశక్తి - నిడమర్రు

వట్టి వసంత్ కుమార్ రాజకీయ వారసుడు వట్టి వపన్‌కుమార్ మంగళవారం నిడమర్రు మండలంలో పర్యటించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన కీలక నాయకులు, నేతలను కలిశారు. ఆయా చోట్ల మహిళలు హారతులతో స్వాగతం పలికారు. పెదనింద్రకొలను గాంధీ భవనాన్ని వపన్ సందర్శించి, మహాత్ముని విగ్రహానికి నివాళులర్పించారు. చిననింద్రకొలను, బైనేపల్లి, తోకలపల్లి, ఆముదాలపల్లి తదితర గ్రామాల్లో నాయకులను కలుసుకున్నారు. అందరి సలహాలు సూచనల మేరకు తగిన గౌరవం ఉన్న పార్టీలో అందరి అంగీకారంతోనే చేరతానని పవన్ వెల్లడించినట్లు తెలిసింది.

అంగన్‌వాడీ కేంద్రానికి ప్లేట్లు, గ్లాసులు అందజేత

అంగన్‌వాడీ కేంద్రానికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం 119కు డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్టీలుగ్లాసులు, ప్లేట్లు అందజేశారు. బుధవారం కలవగంటి సత్యనారయణ, భారతి దంపతుల మనవరాలు నిత్యశ్రీ అన్నప్రాసన సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి స్టీలుగ్లాసులు అందించారు. ఈ సందర్భంగా డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నెలపోలు ప్రభాకర్ రావు మాట్లాడుతూ పుట్టినరోజు, అన్నప్రాసన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆదర్శనీయమన్నారు. అంబేద్కర్ యువజన సంఘం చూసిన మేరకు కలవగంటి సత్యనారయణ, భారతి దంపతుల వితరణతో అంగన్‌వాడీ కేంద్రానికి 25 స్టీలు ప్లేట్లు, 25 స్టీల్ గ్లాసులు అందించామని తెలిపారు. అనంతరం దాతలను అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి పఠాన్ బాజీ, అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

30న రైతు, కార్మిక రాష్ట్ర సదస్సు

బుట్టాయగూడెం: సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 30న విజయవాడలో సిద్దార్థ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు అఖిలభారత రైతుకూలి సంఘం ఎఐకెఎంఎస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం మండల కేంద్రంలో సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో కర్షక-కార్మిక రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఎఐకెఎంఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మల సురేష్ మాట్లాడుతూ దేశంలో పంటలన్నిటికీ ఆహార, వాణిజ్య, ఉద్యాన, సామాజిక వన పంటలకు సమగ్ర పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధరను నిర్ణయించాలని అన్నారు. రైతుల పంట రుణాలను రద్దు చేయాలన్నారు. రైతుల ఆత్మహత్యలను అరికట్టాలన్నారు. అనంతరం అఖిల భారత రైతు కూలీ సంఘం ఎఐకెఎంఎస్ వెట్టి సుబ్బన్న, ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, తగరం బాబురావు, ఎస్.రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కృషి, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు..

ఆరో తరగతిలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించిన మోక్షజ్ఞ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మోక్షజ్ఞను సన్మానిస్తున్న అధికారులు..

కృషి, పట్టుదల, క్రమశిక్షణ, అంకుటిత దీక్షతో చదివితే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు వి.జయప్రకాష్ తెలిపారు. ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన దేవరపల్లి సురేష్ కుమారుడు దేవరపల్లి మోక్షజ్ఞ విజయనగరం జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూల్లో చదివి ఆరో తరగతిలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు వి.జయప్రకాష్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి మోక్షజ్ఞను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవితం ప్రతిఒక్క విద్యార్థి చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలన్నారు. ఎవరైతే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తారో, వారి మార్గదర్శకానికి విలువ ఇస్తారో వారు ఉన్నత జీవితాన్ని పొందుతారన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు మంచి జీవితం, చక్కని చదువు అందించడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, విద్యాకానుక, జగనన్న విదేశీదీవెన, నాడు-నేడు వంటి పథకాలు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఆరో తరగతిలో అల్ ఇండియా మొదటి ర్యాక్ రావడం సాధారణ విషయం ఏమీ కాదని, అందులో విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయల కృషి ఎంతో ఉందన్నారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా విజిలెన్స్, మోనిటరింగ్ సకాత్రేనిపాడు సర్పంచి జి. మోహన్ రావు, సొసైటీ అధ్యక్షులు ప్రతాప్, ఎపిహెచ్ డబ్ల్యూఎస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్‌లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా శంకరరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

శంకరరావు..

మండలంలోని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా డిఎస్ బి.శంకరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన టి.నరసింహస్వామి ఉద్యోగ విరమణ పొందగా ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా శంకరరావు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంతో పాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పల్లెర్లమూడిలో 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పల్లెలమూడి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ విజయబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేయాలని ఆయన అన్నారు. జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం పేదవాళ్లందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. అనంతరం ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి అధికారులు, గ్రామ సర్పంచి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సతీష్..

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా వుండాలని ఎస్ఐ కె.సతీష్ కుమార్ సూచించారు. మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థులకు పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలను ఈవ్‌టీజింగ్, రాగింగ్ చేస్తే చట్టప్రకారం శిక్షర్హులని, అటువంటి వారి గురించి వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మాధకద్రవ్యాలు, చెడువ్యసనాల వలన యువత బంగారు భవిషత్తు నాశనమౌతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.లింగస్వామి, ఆలీ, ఉపాధ్యాయులు ఆర్‌విజి కృష్ణారావు, కె.కుటుంబరావు, రాజు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే స్థలాల ఆక్రమణ చట్టరీత్యా నేరం

ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది..

ప్రజాశక్తి - మండవల్లి

రైల్వే స్థలాలను ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకోవడం చట్టరీత్యా నేరమని రైల్వే లీగల్ సెల్ ఫణి మోహన్ స్పష్టం చేశారు. మండలంలోని పుట్ల చెరువులో రైల్వే స్థలాలను ఆక్రమించుకున్న ఆక్రమణదారులతో మంగళవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్థలాలను ఆక్రమించడం అనేది ఎప్పటికైనా ప్రమాదమే అని అన్నారు. ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న, భవంతులు కట్టుకున్న ఎప్పటికైనా కూల్చేయడం తప్పనిసరి అన్నారు. ఇప్పటికే మండవల్లి తదితర ప్రాంతాలలో పూర్తిస్థాయిలో ఆక్రమణను తొలగించడం జరిగిందని తెలిపారు. ఎవరికి వారే స్వచ్ఛందంగా తొలగించుకుంటే ఆస్తులకు భంగం కలగకుండా ఉంటుందని ఆక్రమణదారులకు ఆయన తెలియజేశారు. దీంతో స్పందించిన ఆక్రమణదారులు తామే తమ నివాసాలను తొలగించుకుంటామని చెప్పడంతో పాటు మంగళవారం పూర్తిస్థాయిలో వారే ఆక్రమించుకుని ఇళ్లను ఖాళీ చేసి కూల్చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే పోలీస్ సిబ్బంది, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నిండా మునిగిన రైతన్న

- వేలాది ఎకరాలు నీట మునక
- ఎగదన్నుతున్న డ్రెయిన్లు
- చెరువులను తలపిస్తున్న చేలు
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

చేల్లో మునిగిన వరిని చూపిస్తున్న చినపాలపర్రు రైతులు

తుఫాన్ ప్రభావంతో మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో వెదజల్లిన వరిచేలు, నారుమడులు నీట మునిగాయి. కుండపోతగా కురుస్తున్న వర్షాలకు మండల వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో వరిచేలు పూర్తిగా నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో ఏగ్రామంలో చూసిన ఇదే పరిస్థితి. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. సోమవారం ఉదయం వరకూ పర్వాలేదు అనుకున్న రైతులకు సోమవారం రాత్రి కురిసిన కుండపోత వానతో, చేల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో, పొలం గట్లు వరకూ మునిగిపోయాయి. మంగళవారం ఉదయం చేలు చూసేందుకు వెళ్లిన రైతుల గుండెల్లో రైలు పరుగెత్తాయి. వరిచేలు నీట మునిగి చెరువులా కనిపించడంతో రైతులు ఆందోళనకు గురైయారు. దీంతో ఇప్పటికే వేలాది రూపాయలు పంటపై పెట్టుబడులు పెట్టుకున్న రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని అన్నీ మేజర్, మైనర్ డ్రయిన్లు భారీ వర్షానికి పొంగి ప్రవాహిస్తున్నాయి. చేల్లో నీరు డ్రయిన్లల్లోకి పారుదల లేక చేల్లోనే నిలిచిపోయాయి. పోల్‌రాజ్ డ్రయిన్ ఎదురుతన్నడంతో డ్రయిన్ ఆయుకట్టు పరిధిలోని చినపాలపర్రు, కోడూరు, ముదినేపల్లి తదితర గ్రామాల్లోని వరిచేల్లోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. అన్నీ డ్రయిన్లు ఎదురుతన్నడంతో చేల్లో నీరు బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీనికి తోడు పోల్‌రాజ్ డ్రయిన్ వంతెన కనాలకు దట్టంగా గుర్రుపు డెక్క పట్టి వేయడంతో చేల్లో నీరు డ్రయిన్‌లోకి వెళ్లే మార్గం లేక చేల్లో నిలిచిపోయాయి. దీంతో చేలు మొత్తం ముంపుకు గురైయ్యాయి. ఇప్పటికే ఎకరాలకు రూ.15 వేల వరకూ ఖర్చు చేసినట్లు చినపాలపర్రుకు చెందిన రైతు పెందుర్తి వెంకట్రావు చెబుతున్నారు. భారీ వర్షాలు తమను కోలుకోలేని దెబ్బ కొట్టాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు మే నెల చివరి వారంలో విత్తనాలు వెదజల్లాగా, మరికొందరు జూన్ నెల 15 తర్వాత విత్తనాలు వెద జల్లారు. ఇప్పటికే చేల్లో రెండుసార్లు మందులు, ఎరువులు వేసినట్లు రైతులు చెబుతున్నారు. ఇంతలోనే భారీ వర్షాలు తమ కొంప కోల్లేరు చేసినట్లు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పంటకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడంతో పాటు తిరిగి పంటను వేసుకునేందుకు సబ్సీడిపై వరి విత్తనాలు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని మండల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మాట్లాడుతున్న రైతులు..

పోల్‌రాజ్ డ్రెయిన్ వద్ద దట్టంగా పేరుకుపోయిన డెక్క

వరద బాధితులకు కూరగాయలు, పాల ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - కుక్కునూరు

గోదావరి వరదలు గొమ్ముగూడెం గ్రామాన్ని చుట్టుముట్టడంతో గతవారం రోజులుగా రావికుంట పునరావాస కేంద్రంలో తలదాచుకున్న 250 వరద బాధిత కుటుంబాలకు మంగళవారం వైసిపి మండల కమిటీ ఆధ్వర్యంలో కూరగాయలు, పాల ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కె.నరసింహ రాజు, వినోద్, కె.కృష్ణంరాజు, చిన్న నరసింహారాజు, తాండ్ర.రాజేష్, సాదు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

చింతలపూడిలో జోరువానలో తిరుగు ప్రయాణమవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించు బందులో భాగంగా మండలంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం బందు చేశారు. ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థి సంఘాలు ఇచ్చిన నోటీసుకు స్పందించి స్వచ్ఛందంగా సెలవు ప్రకటించగా, ప్రభుత్వ హైస్కూల్స్, కళాశాలలను విద్యార్థి సంఘ నాయకులు వెళ్లి బంద్ చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తోర్లపాటి రాజు, ఎఐఎస్ఎఫ్ నాయకులు సాలి అవినాష్ మాట్లాడుతూ గత నెలలో విడుదల చేసిన అమ్మఒడి ఇప్పటికీ విద్యార్థుల తల్లి ఖాతాకు చేరలేదని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్, మెస్ ఛార్జీలు పెంచాలని, ఖాళీగా ఉన్నటువంటి రెండు లక్షల 50 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంద్‌కి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బందులో ఎఐవైఎఫ్ నాయకులు బొల్లవరపు విజయ్ శేఖర్, రాజేష్, విద్యార్థి సంఘ నాయకులు సాయి పాల్గొన్నారు.

ముసునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భాను పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శాంతియుతంగా బంద్ జయప్రదం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ధరలు పెరుగుదలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

పోలవరం: మండలంలోని ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల్లో బంద్ కార్యక్రమం విజయవంతం కావడంతో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖాధికారి చూడామణికి టిఎన్ఎస్ఎఫ్ సభ్యులు వారి డిమాండ్‌తో కూడిన వినతిని అందించి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మీసాల పవన్ కళ్యాణ్, కొత్తపల్లి సతీష్, జల్లేపల్లి వెంకట కార్తిక్, షేక్ ఖాజా, తోట రామకృష్ణ, జితేంద్ర పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: విద్యార్థుల సమస్యలపై విద్యార్థి సంఘాల పిలుపు మేరకు చేపట్టిన బంద్ విజయవంతంపై పలువురు విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి పారేపల్లి పవన్ మాట్లాడుతూ టిఎన్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్ఎ పిలుపుమేరకు విద్యాసంస్థల బంద్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు గోలి అనిల్, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి లాగు సురేష్ పాల్గొన్నారు..

నూజివీడు రూరల్: పట్టణంలో మంగళవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్ఎ, టిఎన్‌టియుసి సంయుక్త ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ బంద్ నిర్వహించారు. దీంతో ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ముందు రోజే సెలవు ప్రకటించాయి. ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థి సంఘాల నాయకులు మూయించారు.

విరాళాన్ని అందజేస్తున్న విజయకుమారి

రామాలయానికి రూ.10 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: ఈస్ట్ ఎడవల్లి గ్రామంలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంకు కోటగిరి విద్యాధరరావు భార్య కోటగిరి విజయకుమారి రూ.10 లక్షల విరాళము ఫిక్సడ్ డిపాజిట్ రూపములో వేసి, సంబంధిత పత్రాలను ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి నటరాజరావునకు అందజేశారు. సదరు సొమ్ముపై వచ్చిన వడ్డీతో స్వామి వారి అలంకరణ, నిత్య కైంకర్యములు జరిపించవలసినదిగా ఆమె కోరారు.

సచివాలయం ముందు బైఠాయించిన ఉపసర్పంచి

నూజివీడు రూరల్: అన్నవరం గ్రామంలో గ్రామ పంచాయతీ సచివాలయం ముందు ఉపసర్పంచి, టిడిపి నేత చలసాని గోపాలకృష్ణ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 140 తీర్మానాలు చేసినప్పటికీ ఏఒక్క తీర్మానం అమలు చేయలేదని వాపోయారు. చారిటబుల్ ట్రస్ట్ వారు ప్రజల ఆరోగ్యం కోసం మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించడం కోసం ముందుకు వస్తే ఎందుకు అనుమతి ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. తమ బోర్డు సభ్యులను గౌరవించడం లేదని వాపోయారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, భీమడోలు మండలం, భీమడోలు గ్రామం, డోర్ నెం. 10-50 నివాసి **కొమ్మోజి అరుణ దేవి C/o.** వీరభద్రాచారి కి చెందిన ఒరిజినల్ **దస్తావేజు నెంబర్ 6544/2010** జిరాక్స్ తీసుకొను నిమిత్తం సెంటర్‌కి వెల్లుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. కావున దొరికిన వారు క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

సెల్: 70952 36417

బ్యాగు పోయినది

పాలకొల్లు మండలం, వెలివెల గ్రామ కాపురస్తులు గుమ్మాపు నరసింహారావు గారి కుమారుడు సూర్య వరప్రసాదరావు అను నేను తెలియచేయుచున్నది ఏమనగా నేను **ది. 24-07-2023** సం॥రం తేదీన నేను నా స్వగ్రామము అయిన వెలివెల నుండి పాలకొల్లు సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళు సమయము నందు నా పేరున గల గునుపూడి సబ్-రిజిస్ట్రార్ వారి ఆఫీసు నందు రిజిష్ట్రీ కాబడిన **దస్తావేజు నెం. 6107/2019** ను మరియు నా ఆధార్ కార్డు గల బ్యాగు నా బండి నుండి జారిపోయినది. గాన సదరు బ్యాగు ఎవరికైననూ దొరికిన యెడల యీ క్రింది అడ్రస్సుకు తెలియపర్చగలరు.

అడ్రస్సు: **గుమ్మాపు సూర్య వరప్రసాదరావు**
తండ్రి: నరసింహారావు, వెలివెల గ్రామం
పాలకొల్లు మండలం,
సెల్: 9856299993, 8333951155

సర్టిఫికెట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, దుంపగడప గ్రామం కొక్కిరగడ్డ శ్రావణి, తండ్రి: కొక్కిరగడ్డ రమేష్ అను నా ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ పోయినది. **సర్టిఫికెట్ నెం. 121537, రోల్ నెం. 1305241666 గల ఒరిజినల్ సర్టిఫికెట్ ది.13-07-2023**వ తేదీన జిరాక్సు తీయించుకోను నిమిత్తం దుంపగడప మా గ్రామం నుండి ఆకివీడు సెంటరుకు వెళ్ళుచుండగా నా ఒరిజినల సర్టిఫికెట్స్ ఉన్న ఫైలు పోగొట్టుకున్నాను. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కొక్కిరగడ్డ శ్రావణి
తండ్రి: రమేష్, దుంపగడప,
ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 93472 28829

SUMMONS
(Order 5 Rule 1, 5 and 20 of C.P.C)
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT BHIMAVARAM W.G.District,ANDHRA PRADESH
OS No.336/2018

Between:
M/s Real Grow Exims Private Limited,
Represented by its Director, Seesali village, Kalla Mandal, W,G District, AP. ...Plaintiff
AND
K.N.V.Prasad,
C/O Vinayaka Brokers, Chintalapudi, W.G Dist-534460. ......Defendant

To,
K.N.V.Prasad, C/O Vinayaka Brokers, Chintalapudi, W,,G Dist-534460.Whereas the Plaintiff has instituted the above Suit against you for the relief mentioned in the Plaint therein, you are hereby summoned to appear in the Court in person or by a pleader on the 3rd day of August 2023 (03-08-2023) at 10.30A.M before the above Court.

Take notice that in default of your appearance on the day mentioned above the Suit will be heard and determined in your absence.

Published as per the orders of the Honourable Court

Bhimavaram.
25.07.2023
S Naga Babu,
Advocate , Bhimavaram.

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Creditor I.P.No. 24/2018

పిటీషనరు:
యాళ్ళబండి వెంకట గిరిరావు
రెస్పాండెంట్లు:
దండు సుబ్బరాజు వగైరా
3వ రెస్పాండెంటు:
దండు హర్షిత విజయ భాస్కరరాజు, తండ్రి: సుబ్బరాజు, డో.నెం. 27-5-10, పోస్టు ఆఫీసు రోడ్డు, శివరావుపేట, భీమవరం-2, ప॥గో॥జిల్లా.

పిటీషనరు దాఖలు చేసిన పై నెంబరు ఐ.పి.నందు 3వ రెస్పాండెంటు అయిన మీకు ఆక్షేపణలు /వాదన ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.10-08-2023వ తేదీన పగలు 10:30 ని॥లకు హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను.** లేని పక్షమున మీకు పరోక్షంగా నిర్ధారణ కాబడును.

గంధం వీర వెంకట నాగేశ్వరరావు
అడ్వకేట్, భీమవరం, ప॥గో॥జిల్లా.